మారుతి కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..

2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

మారుతి ఈ-విటారా:

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

నయా గ్రాండ్ విటారా

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి వీలుగా డిజైన్ చేసింది.

కొత్త బాలెనో

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్ స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

అప్‌గ్రేడ్ బ్రెజ్జా

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు

స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు

కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ సంగతి..

సహజంగా రాష్ట్రాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతేకాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

కేసులతో రచ్చ

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరి కొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతో పాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

టెలికం సంస్థలకు ఇక్కట్లే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

శాట్కామ్‌ల ఎంట్రీతో..

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్‌ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

పురుగుల మందు దుకాణల తనిఖీ

పురుగుల మందు దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ

నస్రుల్లాబాద్, డిసెంబర్ 28 : బీర్కూర్‌లోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని ఎరువుల దుకాణాలను శనివారం బాన్సువాడ వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణ తనిఖీ చేశారు. యాసంగి పంటలు సాగు ప్రారంభమైందని, రైతులకు ఎరువులు, పురుగుల మందులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

పాదయాత్ర చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన



కామారెడ్డిలో పాదయాత్ర చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 28 : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిరవధిక సమ్మె శనివారం 19వ రోజుకు చేరింది. జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు మున్సిపల్ ఆఫీస్ నుంచి అమరవీరుల స్తూపం వరకు పాదయాత్ర చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హన్మకొండ ఏకశిల పార్క్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తమ సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల సాక్షిగా తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. తమను వెట్టి చాకిరి నుంచి విముక్తి చేయాలని అన్నారు. విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేసే వరకు పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నిజాంసాగర్ చౌరస్తా వద్ద పోలీసు కిష్టయ్యకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, కాళిదాసు, వీణ, సాయిలు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన

బీబీపేట్, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో బాలికల హక్కులపై విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. బాలికల హక్కులు, చట్టాలు, మొబైల్ వినియోగం ద్వారా నష్టాలు, పోక్సో చట్టం, అత్యవసర సమయంలో వినియోగించే ఫోన్ నంబర్ల గురించి అవగాహన కల్పించినట్లు ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి

- చట్టసభల్లో ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు కల్పించాలి
- రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్ డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్

డిచ్‌పల్లి, డిసెంబర్ 28: ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏ కేటగిరీలో మారుస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. జనాభాలో 14.7 శాతం ఉన్న ముదిరాజ్‌లను రాజకీయ లబ్ధి కోసం వివిధ పార్టీలు వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, రాజకీయంగా, ఆర్థికంగా ఎలాంటి లబ్ధి చేకూర్చడం లేదన్నారు. డిచ్‌పల్లి శివారులోని ఓ హోటల్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగనే ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి ఏ కేటగిరీలోకి మారుస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అమలు చేయలేదని మండిపడ్డారు. ముదిరాజ్‌లకు మత్స్య సహకార సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధి అవకాశాలు లేక ముదిరాజ్‌లు ఆర్థికంగా వెనుకబడి పోతున్నారన్నారు. బెంగాల్‌లో ఇంటి ముందే చేపల పెంపకం, చేపల మార్కెట్లు ఉంటాయని, అదే పద్ధతిని ఇక్కడ అమలు చేస్తే ముదిరాజ్ జాతికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కేజ్ కల్చరల్‌ను తమకు ఇవ్వకుండా మల్టీ నేషనల్ కంపెనీలకు అప్పగించడం సరికాదని తెలిపారు. రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న ముదిరాజ్‌లకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్, ప్రతినిధులు ఎల్లన్న ముదిరాజ్, వెల్డింగ్ నారాయణ, ప్రసాద్, శ్రీనివాస్, సంగేమశ్వర్ సత్యనారాయణ, మురళి, నాయకులు పాల్గొన్నారు.

2న ఏకసభ్య కమిషన్ బృందం రాక

కంఠేశ్వర్, డిసెంబర్ 28 : ఎస్సీ ఉప వర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టీస్ షమీమ్ అక్తర్‌తో ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ బృందం జనవరి 2న నిజామాబాద్ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై తమతమ వినతులు అందజేయాలని కోరారు. కమిషన్‌కు నిర్ణీత నమూనాలో సమర్పించాల్సిన దరఖాస్తు ఫారాలు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

4న జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు

వినాయక్‌నగర్, డిసెంబర్ 28 : ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నిజామాబాద్ డివిజన్, నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జనవరి 4న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యజీవితంలో సైన్స్ ఉపయోగం, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు అంశాలపై క్విజ్ పోటీలు ఉంటాయని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలకు 6 నుంచి 12 వతరగతి చదివే విద్యార్థులు అర్హులని, ఒక పాఠశాల/ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు జనవరి 2వ తేదీలోగా 99664 40700 (నిజామాబాద్), 9394680680 (కామారెడ్డి) నంబర్లకు ఫోన్ చేసి వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యా, వైద్యం, ఇల్లు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష

కామారెడ్డి, డిసెంబర్ 28 : పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధన కోసం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శనివారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయమైన ఉచిత విద్యా, వైద్యం, భూమి, ఇల్లు సాధించేంత వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మణ్, రాజు, భోజేశ్వర్, అరవింద్, రాజు, రాజశేఖర్, సాయి, మురళి, మహేశ్, పరశురాములు, ప్రభాకర్, శివరామ కృష్ణ, బాలు, సత్యం, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

సిద్ధరామేశ్వనగర్‌లో చోరీ

వివరాలు సేకరిస్తున్నా పోలీసులు, క్లూస్ టీం సభ్యులు

భిక్కనూరు, డిసెంబర్ 28 : మండలంలోని సిద్ధరామేశ్వరనగర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన బాబూమియ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తు తెలియని దుండగులు చొరబడి సుమారు రూ.90 వేల విలువైన ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధితుడు ఇంటికి వచ్చేసరికి వస్తువులు, బీరువా ధ్వంసం అవ్వడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎస్సై జగదీశ్ , క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ఇండ్ల సర్వే

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 28 : బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్, బోర్లం, కొల్లూరు, నాగారం, హన్మాజీపేట్, కోనాపూర్ తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి శనివారం వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సర్వర్ ప్రాబ్లంతో సర్వే ఆలస్యం అవుతున్నదని కార్యదర్శులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శులు సర్వేను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

రేపు గాయకుల ఎంపిక

సుభాష్‌నగర్, డిసెంబర్ 28 : ప్రముఖ ప్రజాకవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ రచించిన 'నూరేళ్ల నా ఊరు' గేయ కావ్యానికి గాయనీ గాయకులు కావలెనని కళాకారులు అష్ట గంగాధర్, రేలారే గంగ, నరాల సుధాకర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు గాయకుల ఎంపిక కార్యక్రమం ఉంటుందని, ఉమ్మడి జిల్లాలోని కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 243 చరణాలు కలిగిన ఈ గేయ కావ్యాన్ని 243 మంది ప్రతిభావంతులైన గాయకులతో పాడించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో రాంపూర్ సాయి, రమేశ్, సాయిలవోల, లక్క క్రాంతి, సవిత, దివ్య పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు

భిక్కనూరు, డిసెంబర్ 28 : హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దని వైఆర్‌జీ కేర్ లింక్ సభ్యులు అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కాచాపూర్, పెద్దమల్లారెడ్డిలో శనివారం ఎల్‌ఈడీ చిత్ర ప్రదర్శనతో హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులు వచ్చే మార్గాలు, నివారణ, జాగ్రత్తల గురించి వివరించారు. ఆయా వ్యాధులపై సేవలు అందించే కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ బాలకిషన్, ఆటో యూనియన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.